క్లుప్తంగా

కంది విత్తనాల పంపిణీ



కంది విత్తనాలు, మందులు పంపిణీ చేస్తున్న అధికారులు

కురిచేడు: మండలంలోని కురిచేడు, పొట్లపాడు గ్రామాల్లో రైతులకు ఎల్ఆర్‌జీ-52 (అమరావతి) అనే కంది రకం విత్తనాలు మంగళవారం పంపిణీ చేశారు. నీటిలో కరుగు ఎరువు 13.0.45 మరియు ఏమామెట్టిన్ బెంజోయేట్ పురుగు మందులను రైతులకు ఉచితంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అందజేశారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ ఎల్ఆర్‌జీ-52 అను కంది రకం పంట కాలం 160-170 రోజులని, ఎకరానికి 5-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. ఎండు తెగులును తట్టు కుంటుందన్నారు. కంది పంటలో తీసుకోవాల్సిన సమగ్ర పంట యాజమాన్య పద్ధతులు వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డి, మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

దేవస్థాన భూములకు వేలం



వేలంపాట నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

తాళ్లూరు: మండలంలోని లక్కవరంలో పలు దేవాలయాల కింద ఉన్న భూములకు దేవదాయ శాఖ అధికారులు మంగళవారం వేలంపాట నిర్వహించారు. వీరభద్రస్వామి, రామలింగేశ్వర స్వామి, మల్లేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల పరిధిలోని 13 బిట్లకు చెందిన 81.43 ఎకరాలకు వేలంపాట నిర్వహించారు. గతంలో ఈ భూములకు వేలం పాట రూ.1.77 లక్షలు పలకగా ఇప్పుడు రైతులు రూ.3.22 లక్షలకు దక్కించుకున్నారు. పంగులూరు గ్రూపు దేవస్థాన ఈఓ వి.శ్రీనివాసరావు, వాసుబాబు, ఆర్‌ఏ ప్రసాద్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



లారీ పత్రాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం, దర్శితో పాటు పలు ప్రాంతాల్లో దర్శి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. పర్మిట్స్, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని పలు వాహనాలకు రూ.1.06 లక్షల అపరాధ రుసుం విధించారు.

శాకంబరీ దేవికి ప్రత్యేక పూజలు



శాకంబరీ దేవి అలంకారంలో..

పెద్దదోర్నాల: ఆషాఢ మాసం నేపథ్యంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని మండల కేంద్రంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శాకంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి మూల వీరాట్‌ను పలు రకాల కూరగాయలు, ఆకు కూరలతో శోభయామనంగా అలంకరించారు. ఆలయ అర్చకులు బిదరె రాంప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాతసేవ, క్షీరాభిషేకం, సహస్త్ర నామార్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళా భక్తులచే అమ్మవారికి లలితా సహస్ర నామ పారాయణం, మహా మంగళహారతి, శ్రీ వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. తమ ఇలవేల్పు శ్రీ వాసవీ అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పులకించిపోయారు.

గాయత్రి మాతకు ప్రత్యేక పూజలు

గిద్దలూరు రూరల్: ఆషాఢ మాసం ముగింపు సందర్భంగా పట్టణంలోని కాశినాయన కుంటలో గల గాయత్రిమాత ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్వాహకులు, ఆర్యవైశ్య మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సామూహిక కుంకుమార్చనను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

శిథిలావస్థలో బాదాపురం చప్టా

దొనకొండ:

మండలంలోని బాదాపురం, ఎస్సీ కాలనీ వాసులు నిత్యం ప్రయాణం సాగించే చప్టా శిథిలావస్థకు చేరింది. స్థానికులు నిత్యం ఆ చప్టాపై రాకపోకలు సాగిస్తుంటారు. బాదాపురం ప్రజలు ఎస్సీ కాలనీకి రావడానికి, ఎస్సీ కాలనీ వాసులు బాదాపురం వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో నాసిరకంగా చప్టా నిర్మించటంతో నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో ఆ ప్రాంతం అంతా చిల్లచెట్లతో నిండిపోయింది. అంతేకాకుండా నిత్యం వాహన చోదకులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంటుంది. అంతేకాకుండా నిత్యం రైతులు ట్రాక్టర్లతో పొలాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో పక్కనే వాగులో నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. వర్షం కురిసిన సమయంలో వాగులో నీరు ప్రవహిస్తోంది. ఆ సమయంలో రాక పోకలు బంద్ అవుతున్నాయి.



చిల్లచెట్లతో నిండి శిథిలావస్థకు చేరిన చప్టా

ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేదని బాదాపురం గ్రామ ప్రజలు, ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన చప్టా నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడుతున్నారు.

వైఎస్సార్ సీపీ నేత స్థలానికి టీడీపీ నేతల స్కెచ్

- భవనం అక్రమంగా కూల్చివేత
- శిథిలాలు తొలగించి ఆక్రమణకు ప్లాన్



స్లాబ్‌ను పగలగొడుతున్న కార్మికులు

దర్శి: మండలంలోని తూర్పువీరాయపాలెం నడిబొడ్డున టీడీపీ నేతలు అక్రమాలకు తెరలేపారు. గత నెలలో అక్రమ కట్టడాల పేరుతో కూల్చిన భవన నిర్మాణ స్థలాన్ని ఆక్రమించేందుకు పథకం ప్రకారం రంగంలోకి దిగారు. మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముప్పరాజు శ్రీను నివాసాన్ని గత నెల 21వ తేదీన మండలంలోని తూర్పు వీరాయపాలెంలో అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చేశారు. సుమారు 20 లక్షల రూపాయలతో నిర్మించుకున్న ఇంటిని గ్రామ కార్యదర్శి జేసీబీతో వెళ్లి ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేశారు. తూర్పు వీరాయపాలెం సర్వే నంబర్ 133/5లోని ఎ0.02 సెంట్ల స్థలాన్ని 2010లో ముప్పరాజు లక్ష్మి వద్ద కొనుగోలు చేసి రిజిస్టరు చేయించుకున్నారు. ఈ స్థలం విషయంలో టీడీపీకి చెందిన ముప్పరాజు చిన్న వెంకటేశ్వర్లు, మదమంచి ఏడుకొండలు, మండాది శ్రీనులకు బాధితుడు ముప్పరాజు శ్రీను, అతని భార్య రామతీర్థంలకు గతంలో వివాదం జరిగింది. దర్శి, మార్కాపురం కోర్టులను ఆశ్రయించగా ఆ కోర్టుల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు ముప్పరాజు శ్రీను, అతని భార్య రామతీర్థంలకు అనుకూలంగా తీర్పు వచ్చింది. కోర్టు తీర్పు అనంతరం శ్రీను సుమారు రూ.20 లక్షలు వెచ్చించి భవనాన్ని నిర్మించుకున్నాడు.

ఆ స్థలంపై టీడీపీ నేతల కన్ను

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ స్థలంపై టీడీపీ నేతల కన్ను పడింది. వీరాయపాలెం ప్రధాన కూడలిలో స్థలం ఉండటంతో దాన్ని కాజేయాలని చూస్తున్నారు. పడగొట్టిన బిల్డింగ్ స్లాబ్‌ను కటింగ్ మిషన్ తెచ్చి కట్ చేసి ఎత్తి పోస్తున్నారు. ఆ స్థలంలో టీడీపీ నేతలు మరో భవనం నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితుడు ముప్పరాజు శ్రీను వాపోతున్నాడు. టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి అండతోనే టీడీపీ నాయకులు అధికారులను అడ్డు పెట్టుకుని తన భవనాన్ని కూలదోశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ స్థలం కోర్టు పరిధిలో ఉన్నందున ఎటువంటి కట్టడాలు, నిర్మాణాలు జరగకుండా అడ్డుకోవాలని కోరుతున్నాడు. కూలదోసిన తర్వాత ఆ స్థలంలో ఇతరులు వచ్చి పనులు చేయాల్సిన అవసరం ఏంటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఒక వేళ అక్రమ కట్టడం కింద కూలిస్తే ఆ సామగ్రి కట్టించిన యజమానికి ఇవ్వాలిగానీ టీడీపీ నేతలు దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కలెక్టర్‌కు సమస్యల స్వాగతం



ఈఓపీఆర్డీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



గణేష్ కుటుంబాన్ని ఓదారుస్తున్న కలెక్టర్

ముండ్లమూరు (దర్శి): మండలంలో కెల్లంపల్లిలో మంగళవారం పర్యటించిన కలెక్టర్ తమీమ్ అన్సారియాకు గ్రామస్తులు తమ సమస్యలు ఆమె ముందు ఉంచారు. తాగు నీరు అందడం లేదని, ఫ్లోరైడ్ వాటర్ తాగి రోగాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లోరైడ్ అధికంగా ఉండటంతో మొక్కలు కూడా బతకడం లేదని కలెక్టర్‌కు చెప్పి వాపోయారు. గ్రామాల్లో పారిశుధ్యం పనుల బాగా చేయలేదని ఈఓఆర్డీ జనార్దన్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఈదర, ఉల్లగల్లు మినహాయించి 21 పంచాయతీల్లో ఎక్కడా చెత్తతో సంపద సృష్టి జరగడం లేదని మండిపడ్డారు. తీరు మార్చుకోకుంటే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా పారిశుధ్యం బాగా లేకపోతే సహించేది లేదని హెచ్చరించారు.

మానవత్వం చాటుకున్న తహసీల్దార్

కెల్లంపల్లిలో అంజలి కుటుంబాన్ని తహసీల్దార్ లక్ష్మీనారాయణ దత్తత తీసుకున్నారు. వికలాంగుడైన గణేష్‌తో పాటు మరో ముగ్గురు పిల్లలకు అండగా ఉంటామని వారికి హామీ ఇచ్చారు. వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో శ్రీనివాసరావు అనే వ్యక్తి పది కుటుంబాలను దత్తత తీసుకున్నారు. శ్రీనివాసరావుతో పాటు తహసీల్దార్‌ను కలెక్టర్ అభినందించారు. తాము కూడా అంజలి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యాన్నిచ్చారు.

క్రాప్ ఇన్సూరెన్స్‌పై రైతులకు అవగాహన

దొనకొండ: గ్రామాల్లోని రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్‌పై మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ అవగాహన కల్పించారు. మండలంలోని అరవల్లిపాడు, తెల్లబాడు రైతులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు వారే క్రాప్ ఇన్సూరెన్స్ కట్టుకోవాలన్నారు. రైతులు పంట సాగు చేసినట్లు గ్రామ వ్యవసాయ సహాయకుల నుంచి సర్టిఫికెట్ పొందాలన్నారు. పత్తి పంటకు రూ.2100, కందికి రూ.430, మిరప రూ.4500 ఈ నెల 31లోపు చెల్లించుకోవాలన్నారు. గ్రామీణ ఉత్పత్తి పథకం కింద వ్యవసాయ కేంద్రాల్లో కంది విత్తనాలు కిలో రూ.100 అందుబాటులో ఉన్నాయన్నారు. కౌలు రైతులు కౌలు కార్డులు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి వీఆర్‌ఓల నుంచి పొందాలని ఏఓ తెలిపారు. ఆయన వెంట గ్రామ రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



అరవల్లిపాడులో రైతులతో మాట్లాడుతున్న ఏఓ బాలకృష్ణనాయక్

బీమా పథకాలు వినియోగించుకోవాలి

త్రిపురాంతకం: రైతులు పంటల బీమా, పంట నమోదు, అన్నదాత సుఖీభవ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి బి. సంగమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అన్నసముద్రం, మేడపిలో రైతులకు పంటలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు మినీ కిట్లు, కందులు, మినుములు, వరి విత్తనాలపై అవగాహన కల్పించారు. కౌలు రైతులు కౌలు కార్డులను వినియోగించుకోవాలన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు సకాలంలో యాజమాన్య పద్ధతులు పాటించి మంచి ఫలితాలు సాధించాలన్నారు. మొక్కజొన్న, మినుము పంటలను సందర్శించి తగిన సూచనలను సంగమేశ్వరరెడ్డి చేశారు. వీఏఏ లాలూనాయక్, రైతులు పాల్గొన్నారు.

కురిచేడు: అన్నదాత సుఖీభవ పథకంలో పేరు లేని రైతులు ఈ నెల 23వ తేదీ లోపు గ్రామ రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి. సంపత్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ముష్టల గంగవరం, పడమర నాయుడుపాలెం గ్రామాల్లో సాగు చేసిన పెసర, మొక్కజొన్న, వరి నారుమళ్లను ఆయన పరిశీలించారు. పెసర పంటలో లద్దె పురుగును గమనించి దీని నివారణకు ఏమామెట్టిన్ బెంజోయేట్ 100 గ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలని తెలిపారు. అనంతరం వరి నారుమడిలో ఆరోగ్యవంతమైన నారు పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఐదు సెంట్ల నారుమడికి దుక్కిలో కిలో నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాస్ వేయాలని తెలిపారు. నారు ఒక ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరుతడిగా నీరు పెట్టి తర్వాత పలచగా నీరు కట్టాలన్నారు. ఎక్కడన్నా జింక్ లోపం గమనిస్తే లీటర్ నీటికి రెండు గ్రాములు జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. గ్రామ వ్యవసాయ సిబ్బంది సౌమ్య, స్పందన, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.



పెసర పంటను పరిశీలిస్తున్న ఏఓ సంపత్‌కుమార్

25న ఆలయ భూముల కౌలు వేలం

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయ భూముల కౌలు వేలం ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఈఓ మల్లవరపు నాగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు చోళ్లవీడు గ్రామంలోని సర్వే నంబర్ 351లో గల 3.89 ఎకరాల భూమికి రామాలయంలో, అనుములవీడు సర్వే నంబర్ 282లో గల 5.16 ఎకరాల భూమికి ఉదయం 11 గంటలకు రామాలయంలో, రామాపురంలో సర్వే నంబర్ 1142లో గల 5.08 ఎకరాలు, 1213 సర్వే నంబర్‌లో గల 2.29 ఎకరాలు, సర్వే నంబర్ 51లో గల 3.43 ఎకరాల భూమికి మధ్యాహ్నం 12 గంటలకు రామాలయంలో, అర్ధవీడు మండలం రంగాపురం గ్రామంలోని 162 సర్వే నంబర్‌లో గల 7.17 ఎకరాల భూమికి సాయంత్రం 3 గంటలకు రామాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న రైతులు వేలంలో పాల్గొనాలని సూచించారు.



గోవిందును పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోవిందుకు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ

కురిచేడు: మండలంలోని పడమర వీరాయపాలెం సర్పంచ్ బొరిగొర్ల శివలక్ష్మి తండ్రి, మాజీ ఎంపీటీసీ బొరిగొర్ల చిన్న గోవిందును వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మల ఆదేశాల మేరకు స్థానిక నాయకులు ఆయన్ను పరామర్శించారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గోగుల మూడి లింగారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఊట్ల వెంకటేశ్వర్లు, పోతిరెడ్డి నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు సారెడ్డి నాగిరెడ్డి, అంకె గోపాలకృష్ణ, సెక్రటరీ ముప్వా శ్రీనివాస్, రైతు విభాగం అధ్యక్షుడు ముసికర యోగిరెడ్డి, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు పోకూరి సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు ఊట్ల పోలయ్య, సోషల్ మీడియా కన్వీనర్ కోలా సంతోష్‌కుమార్, నాయకులు తాళ్లూరి ఆంజనేయులు, పాతకోట వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ నాగిరెడ్డి, టౌన్ పార్టీ నాయకులు గుంటక నాసర్‌రెడ్డి, యర్రా కోటేశ్వరరావు, కాటం కోటిరెడ్డి ఉన్నారు. గోవిందు ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులతో చెప్పారు.

దురుద్దేశంతోనే మిథున్‌రెడ్డి అరెస్టు



రాములు

పుల్లలచెరువు: లిక్కర్‌లో ఎలాంటి స్కామ్ లేదని తెలిసినా కక్షపూరితంగానే పార్లమెంట్ సభ్యుడు మిథున్ రెడ్డిని అరెస్టు చేశారని, రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతిపక్షాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీ ఎల్.రాములు అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాపాలన కన్నా వైఎస్సార్ సీపీ నేతలను టార్గెట్ చేసి అరెస్టు చేయడమే ధ్యేయంగా పెట్టుకుందని ధ్వజమెత్తారు. రాజకీయ దురుద్దేశంతో తప్పుడు విచారణలు, అక్రమ అరెస్టు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలనలోకి వచ్చి సంవత్సరం దాటినా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వంపై జనంలో ఏడాదిలోనే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని కేసులు పెట్టినా వైఎస్సార్ సీపీ నాయకులు వెనకడుగు వేయరన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే మంత్రి లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. పచ్చ పత్రికలను అడ్డం పెట్టుకుని విష ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో చంద్రబాబునాయుడికి సరైన రీతిలో ప్రజలు సమాధానం చెబుతారని, అలానే కూటమి పార్టీల అకృత్యాలు, రాజకీయ అరెస్టులను ప్రజల్లో ఎండగడతామని రాములు హెచ్చరించారు.

జీతాలు ఇవ్వండి.. లేదా పనిలో పెట్టుకోండి!

- పారిశుధ్య కార్మికుల ఆవేదన



బాధిత పారిశుధ్య కార్మికులు

తాళ్లూరు: పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు పారిశుధ్య కార్మికులు తమ విధులు బాధ్యతగా చేస్తూ కీలకంగా వ్యవరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశుధ్య కార్మికుల జీతాలు నిలిపేసింది. అంతేకాకుండా వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే కారణంతో కొందరిని విధుల నుంచి తొలగించారు. ఈ సంఘటన మండలంలోని కొర్రపాటివారిపాలెంలో వెలుగు చూసింది. గ్రామానికి చెందిన పులి కోటేశ్వరరావు, సంగం హెస్స్, సంగం యొకోబులు చాలా ఏళ్ల నుంచి పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సమయానికి జీతాలు అందేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ టీడీపీ నాయకులు పారిశుధ్య కార్మికులపై కక్షగట్టారు. కార్మికులు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే కారణంతో జీతాలు నిలిపేయడంతో పాటు వారిని విధుల నుంచి తొలగించారు. ఇలా చేస్తే కుటుంబ పోషణ ఎలా జరుగుతుందని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆ గ్రామ పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. జీతాల కోసం కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని, గ్రీవెన్స్‌లో అర్జీ పెడితే విధులు నిర్వహించినట్లు రికార్డులో లేదని గ్రామ సర్పంచ్ చెప్పారని జిల్లా అధికారులు పేర్కొంటున్నారు. తిరిగి పనిలో పెట్టుకొని నిలిపేసిన జీతాలు ఇవ్వాలని పారిశుధ్య కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో దారా హనుమంతరావును వివరణ కోరగా సమస్య తన దృష్టికి రాలేదని చెప్పారు.

ప్రజా పోరాటాల నేత అచ్యుతానందన్



అచ్యుతానందన్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

దర్శి: ప్రజల సమస్యలపై పోరాడే నేత, కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానంద..అని సీపీఎం దర్శి నాయకులు తాండవ రంగారావు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో మంగళవారం అచ్యుతానంద్ చిత్రపటానకి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ పేదరికంతో కార్మికునిగా మారి 14 ఏళ్లలోనే పార్టీలోకి వచ్చిన ఆయన 1946 ప్రాంతంలో ఉన్నప్ప వాయలార్ రైతాంగ పోరాటంలో పాల్గొని తిరుగులేని నాయకుడిగా ఎదిగారని, ఆయన లేని లోటు పార్టీకి పూడ్చలేనిదన్నారు. కేరళను ఐటీ రంగంలో నిలపడంలో బాగంగా ముఖ్యమంత్రిగా కంపెనీలను తెచ్చి నిరుద్యోగ సమస్యను పరిష్కరించారన్నారు. మూడుసార్లు ప్రతిపక్ష నేతగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని కొనియాడారు. 2006-11 మధ్యకాలంలో ఆయన కేరళ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారని చెప్పారు. అవినీతి ఆరోపణ లేని మహా మనిషి అని, ఆయన చూపిన బాటలో సీపీఎం పయనించడం నేటి తరం కర్తవ్యమన్నారు. సీపీఎం నాయకులు ఎం.యలమందారెడ్డి, మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు, శాఖ కార్యదర్శులు ఉప్పు నారాయణ, చిట్లా ఆదినారాయణ, షేక్ కాలేబాషా, గర్నెపూడి జాన్ సామ్యేల్, కాంతారావు, బలుమూరి అంజిబాబు, జాలా సుశీల, వెంకయ్య, సుదర్శనం పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయంలో ఆషాఢమాసం మాసశివరాత్రి సందర్భంగా స్వామి వారికి ఘటాభిషేకం, అమ్మవారికి శాకాంబరి అలంకారం ప్రత్యేక పూజలు బుధవారం నిర్వహించనున్నారు. త్రిపురాంతకంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు సందర్భంగా భక్త బృందంచే పసుపు, కుంకుమ, సారెను గ్రామంలోని విడిది గృహం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లనున్నారు. ఈ మేరకు ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.